సాక్షి
ఆదిలాబాద్
శుక్రవారం । 22 । మార్చి । 2024



ఓటుందా.. సరిచూసుకోండి

తుది జాబితాలో ఓటు లేని వారు ఏప్రిల్ 15వ తేదీ దాకా ఓటరుగా నమోదు చేసుకునే వీలుంది. ఇందుకు అవసరమైన ఫారం–8 కోసం స్థానిక బీఎల్వోను సంప్రదించాలి. 8లో▸



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
శుక్ర: 6:29	శని: 4:55

గరిష్టం/కనిష్టం
36.0/24.0

వాతావరణం

ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. మధ్యాహ్నం ఉక్కగా ఉంటుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. చలి తగ్గుతుంది.

న్యూస్‌రీల్

'పది' పరీక్షాకేంద్రం తనిఖీ



పరీక్షా కేంద్రంలో కలెక్టర్ రాజర్షిషా

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ రాజర్షిషా తనిఖీ చేశారు. పదో తరగతిలో మాస్‌కాపీయింగ్ జరుగుతున్నట్లు సోషల్ మీడియాలో తప్పుడు సమాచారం ఇస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఉట్నూర్‌లో పేపర్ లీకైనట్లు వైరల్ కాగా, ఎంఈవోతో విచారణ చేపట్టామని తెలిపారు. చివరకు ఇది ఫేక్ అని తేలిందని పేర్కొన్నారు. ఎస్పీ గౌస్ ఆలం మాట్లాడుతూ.. తప్పుడు ప్రచారం చేసిన నలుగురిపై ఇప్పటికే కేసులు నమోదు చేసినట్లు చెప్పారు.

ఐదు మడిగెలపై కమిషనర్ ఆరా


మడిగెల.. మర్మమేంటో!?

సాక్షిలో ప్రచురితమైన కథనం

సాక్షి ఎఫెక్ట్..

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ మున్సిపల్ కార్యాలయ పాత భవనం కింద ఉన్న ఐదు మడిగెలను రెండేళ్లుగా అద్దెకివ్వని వైనాన్ని వివరిస్తూ ఈ నెల 20వ తేదీన 'మడిగెల మర్మమేంటో..' శీర్షికన 'సాక్షి'లో ప్రచురించిన కథనానికి మున్సిపల్ కమిషనర్ ఎండీ ఖమర్ అహ్మద్ స్పందించారు. పట్టణ ప్రణాళికా విభాగం అధికారులను తన ఛాంబర్‌కు పిలిపించుకుని ఆరా తీశారు. వాటికి సంబంధించిన ఫైల్ తెప్పించుకున్నారు. మడిగెలను ఎప్పటి నుంచి పెండింగ్‌లో ఉంచారు.. గతంలో వాటిని ఎంతకు అద్దెకిచ్చారు.. వాటి ద్వారా వచ్చిన ఆదాయం ఎంత.. తదితర వివరాలు తెలుసుకున్నారు. ఆ ఐదు మడిగెనున నిబంధనల ప్రకారం త్వరలో బహిరంగ వేలం ద్వారా కేటాయించాలని కమిషనర్ ఆదేశించారు.

సోషల్ మీడియా పోస్టులపై దృష్టి సారించాలి

కైలాస్‌నగర్: సోషల్ మీడియాలో వచ్చే పోస్టులపై ప్రత్యేక దృష్టి సారించాలని ట్రెయినీ కలెక్టర్ వికాస్ మహతో ఆదేశించారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో గురువారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) తొలి సమావేశాన్ని నిర్వహించారు. వివిధ దినపత్రికల్లో వచ్చే పెయిడ్ న్యూస్, సోషల్ మీడియా, ప్రింట్ మీడియా, ప్రీ సర్టిఫికేషన్ ఆఫ్ అడ్వర్టైజ్‌మెంట్‌లో వచ్చే అంశాలపై కమిటీ సభ్యులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంసీఎంసీ సెల్ ద్వారా చెల్లింపు వార్తలను ప్రత్యేకంగా గుర్తించనున్నట్లు తెలిపారు. ముందస్తు అనుమతి లేకుండా ఎలాంటి ప్రకటనలు ప్రసారం చేయరాదని మీడియాకు సూచించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అతిక్రమించి పెట్టే పోస్టులపై చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. అభ్యర్థి చేసిన ప్రతీ ఖర్చును వారి ఎన్నికల వ్యయంలో చూపించాలని సూచించారు. ఇందుకు సంబంధించి సెక్షన్–డీలో స్పష్టంగా పేర్కొన్నట్లు తెలిపారు. ఈ మేరకు అభ్యర్థుల రోజువారీ ఖర్చు వివరాలు రిజిస్టర్‌లో నమోదు చేయాలని ఆదేశించారు.

పోలింగ్ కేంద్రం సందర్శన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ గౌస్ ఆలం

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని లింగుగూడ పోలింగ్ కేంద్రాన్ని కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ గౌస్ ఆలం గురువారం సందర్శించారు. పోలింగ్ కేంద్రం పరిధిలో ఏయే నెట్‌వర్క్‌లు అందుబాటులో ఉన్నాయి.. ఏవి పని చేస్తున్నాయి.. తదితర వివరాలు రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు. హోం ఓటింగ్‌కు సంబంధించి ఎన్ని 12 డీ ఫారాలు అందజేశారని తెలుసుకున్నారు. పోలింగ్ కేంద్రంలోని సౌకర్యాలపై ఆరా తీశారు. ఆయన వెంట డీఎస్పీ జీవన్‌రెడ్డి, తహసీల్దార్ దిలీప్‌కుమార్, ఎస్సై ముజాహిద్ తదితరులున్నారు.

మళ్లీ మట్కా..!

ఇటీవలి ఘటనలు..

- ఈనెల 18వ తేదీన పిప్పర్‌వాడ టోల్‌ప్లాజా వద్ద మట్కా నిర్వహించేందుకు వెళ్లిన మహారాష్ట్రకు చెందిన ఆరుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి మట్కా చీటీలతో పాటు రూ.6,030 నగదు స్వాధీనం చేసుకున్నారు. జైనథ్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. మహారాష్ట్రలోని పాఠన్‌బోరి కేంద్రంగా అశోక్ సామ్రాట్ వద్ద మట్కా నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. వీరిపై సస్పెక్టెడ్ షీట్‌తో పాటు మళ్లీ పునరావృతమైతే పీడీయాక్ట్ నమోదు చేస్తామని పోలీసులు హెచ్చరించారు.
- ఈనెల 19వ తేదీన టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఖుర్షీద్‌నగర్‌లో మట్కా నిర్వహిస్తున్న నిందితుడు అబ్దుల్ సలాంను అరెస్ట్ చేశారు. రూ.4,330 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.
- ఈనెల 20వ తేదీన టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని తాంసి బస్టాండ్ వద్ద సీసీఎస్ పోలీసులు మట్కా నిందితుడు సాబిర్‌ఖాన్‌ను పట్టుకున్నారు. అతడి నుంచి రూ.5,210 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఆయనపై టూటౌన్‌లో కేసు నమోదు చేశారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న మట్కా చీటీలు, నగదు, సెల్‌ఫోన్లు (ఫైల్)

- ఆదిలాబాద్ కేంద్రంగా నిర్వహణ
- ఆన్‌లైన్‌లో కొనసాగుతున్న జూదం
- వీడకుంటే పీడీ యాక్ట్‌లు తప్పవు
- జూదరులకు పోలీసుల హెచ్చరిక

ఆదిలాబాద్‌టౌన్: మట్కా నిర్వాహకులు మళ్లీ దందాకు తెరలేపారు. కొద్ది నెలలుగా మట్కా కనుమరుగవగా వారం, పదిరోజులుగా మళ్లీ జోరందుకుంది. వరుసగా మూడు, నాలుగు రోజులుగా మట్కా నిందితులను పోలీసులు పట్టుకుంటున్నారు. పలువురు అమాయకులను ఈ ఊబిలోకి దించుతున్నారు. రెట్టింపు డబ్బులు వస్తాయని ఆశ చూపుతుండగా జనాలు వారి వలలో చిక్కుతున్నారు. గతంలో జిల్లాలో మట్కా నిర్వాహకులపై పోలీసులు నిరంతర దాడులు నిర్వహించి ఉక్కుపాదం మోపిన విషయం తెలిసిందే. ప్రస్తుతం తాజాగా మళ్లీ వారి ఆగడాలు మితిమీరుతున్నాయి. సీసీఎస్ పోలీసులు విస్తృతంగా దాడులు నిర్వహించి వారిని పట్టుకుంటున్నారు. అయితే చిన్నచిన్న మట్కా నిందితులు మాత్రమే పట్టుబడుతుండగా, బడా దందా కొనసాగిస్తున్న వారు మాత్రం పోలీసుల నుంచి తప్పించుకుంటున్నారనే విమర్శలున్నాయి. పీడీ యాక్ట్ పెడతామని హెచ్చరించినప్పటికీ పెడచెవిన పెడుతున్నారు. వారి నుంచి నగదుతో పాటు మట్కా చీటీలు, వాహనాలు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుంటున్నప్పటికీ దందాను మాత్రం వారు వదిలిపెట్టడం లేదు. కటకటాల పాలైన వారు బయటకు వచ్చిన తర్వాత మళ్లీ మట్కా నిర్వహణ చేస్తున్నట్లు తెలుస్తోంది.

మట్కా నిర్వహణలో కొత్త పుంతలు

జిల్లాలో మట్కా దందా కొత్త పుంతలు తొక్కుతోంది. ఇది ఆన్‌లైన్‌లో కొనసాగుతుండగా యువతను ఆగం చేస్తోంది. జిల్లాలో చిట్టీల ద్వారా మట్కా ఆడినవారు ఇప్పుడు వాట్సాప్‌ను ఉపయోగించి ఆడుతున్నట్లు పోలీసుల తనిఖీలో వెలుగులోకి వచ్చింది. రూ.పదికి రూ.వంద.. రూ.వందకు రూ.వెయ్యి.. రూ.వెయ్యికి.. రూ.లక్షలు అంటూ మట్కా జిల్లాలో జోరుగా సాగుతోంది. లక్కు కలిసొస్తే రూ.లక్షాధికారి కావొచ్చంటూ అమాయకులను ఈ దందాలోకి లాగుతున్నారు. ఒకప్పుడు మహారాష్ట్ర సరిహద్దులో ఎక్కువగా నడిచిన మట్కా ఇప్పుడు పట్టణాలు, జిల్లా కేంద్రానికి పాకింది. గతంలో చిట్టీల ద్వారా మట్కా ఆడేవారు. ఇప్పుడు అంతా ఆన్‌లైన్‌లోనే సాగుతోంది. అటు పేమేంట్ కూడా గూగుల్‌పే, ఫోన్‌పే ద్వారానే ట్రాన్స్‌ఫర్ చేసుకుంటున్నారు. అయితే జిల్లాలో మట్కా సమూలంగా నిర్మూలించేందుకు ఎస్పీ ప్రత్యేక దృష్టి సారించారు. ఈ క్రమంలో మూడు, నాలుగు రోజులుగా మట్కా నిర్వాహకులు పట్టుబడుతున్నారు.

కూలీలు, యువతే లక్ష్యంగా..

గతంలో రహస్యంగా చిట్టీలపై నంబర్లు రాసి మట్కా దందా నడిపేవారు. ఇప్పటికీ జిల్లాలో కొన్నిచోట్ల ఇది కొనసాగుతోంది. మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా మట్కా జోరుగా ఆడుతున్నట్లు తెలుస్తోంది. వాట్సాప్ ద్వారా మట్కా ఆడుతున్న నిందితులను గతంలో పోలీసులు అరెస్ట్ చేసిన ఘటనలున్నాయి. ఓపెన్, క్లోస్, సింగిల్, పానా వివిధ రకాలుగా ఈ మట్కా సాగుతోంది. ఇలా రెగ్యులర్‌గా జిల్లా కేంద్రంలో పదుల సంఖ్యలో వాట్సాప్ ద్వారా మట్కా ఆడుతున్నట్లు తేలింది. కూలీలు, యువత, చిరు వ్యాపారులే టార్గెట్‌గా దందా సాగుతోంది. మట్కా ఆడటంతో పాటు పేమేంట్ కూడా ఆన్‌లైన్‌లోనే జరుగుతుండగా కొన్ని సందర్భాల్లో పెద్ద అమౌంట్ నేరుగా చేతికే ఇస్తున్నారు. ఆడిన అందిరికీ నెలలో ఒక్కరోజు కూడా డబ్బులు రాకపోవడంతో ఆర్థికంగా నష్టపోతున్నారు. ఏజెంట్లు మాత్రం కమిషన్లతో లక్షలు గడిస్తున్నట్లు తెలుస్తోంది.

ఉక్కుపాదం మోపుతాం



మట్కాపై ఉక్కుపాదం మోపుతాం. మట్కా నిర్వహణపై ప్రత్యేక నిఘా పెట్టాం. ప్రస్తుతం ఎన్నికల నేపథ్యంలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశాం. ఎక్కడా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా వారిపై కఠినంగా వ్యవహరిస్తాం. కేసులు నమోదు చేస్తాం. ఆదిలాబాద్ పట్టణంలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి దాడులు నిర్వహిస్తున్నాం. పాత నేరస్తులను పట్టుకుని బైండోవర్ చేస్తున్నాం.

– గౌస్ ఆలం, ఎస్పీ

ఎస్సెస్సీ పేపర్ లీక్ కట్టుకథ

- నిర్ధారించిన అధికారులు
- తప్పుడు ప్రచారం చేసినవారిపై కేసు

ఉట్నూర్‌రూరల్: ఈ నెల 19వ తేదీన ఉట్నూర్‌లో ఎస్సెస్సీ ఉర్దూ పేపర్ లీకేజీ వ్యవహారంపై విచారణ చేపట్టాలన్న ఎస్పీ గౌస్ ఆలం ఆదేశాల మేరకు బుధవారం ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్ విచారణ చేపట్టారు. ఉట్నూర్ టీఎంఆర్ఎస్ ప్రిన్సిపాల్ వెంకటప్రసాద్‌పై కక్ష్యసాధింపు దిశగా ఈ కాపీయింగ్ పన్నాగం పన్నినట్లు నిర్ధారించారు. విచారణలో డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన మహ్మద్ ముబాషిర్ గతంలో ఉట్నూర్ మైనార్టీ గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేశాడు. అతడి తీరు సరిగా లేక ఇచ్చోడకు బదిలీ చేశారు. కానీ.. ముబాషిర్ ఈ ఉద్యోగం మానేసి ఏకలవ్య స్కూల్‌లో అవుట్ సోర్సింగ్ ఉద్యోగిగా చేరాడు. కానీ.. తనను బదిలీ చేసిన టీఎంఆర్ఎస్ ఉట్నూర్ ప్రిన్సిపాల్ వెంకటప్రసాద్‌పై కోపం పెంచుకుని ఎలాగైనా అతడిని బద్నాం చేయాలని చూస్తున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 19న ముబాషిర్ మరో వ్యక్తి ఆసిఫ్‌తో కలిసి ఓ ప్లాన్ వేశాడు. ఉట్నూర్‌లో పనిచేసే ఉపాధ్యాయుడు అబ్దుల్ సమీ ఇంటికి సయ్యద్ కైఫ్ అనే వ్యక్తిని పంపించి అతడి వీడియోలు, ఫొటోలు తీసి పంపించమని చెప్పాడు. సయ్యద్ కైఫ్ మరో వ్యక్తి షాదాబ్‌తో వెళ్లి సమీ గ్రామర్ నోట్స్ తెల్ల కాగితంపై రాసుకుంటుండగా వీడియో, ఫొటోలు తీసి వాటిని వాట్సప్ ద్వారా ముబాషిర్‌కు పంపించాడు. తర్వాత ముబాషిర్ ఉపాధ్యాయుడు సమీకి ఫోన్ చేసి.. మాల్‌ప్రాక్టిస్ జరుగుతుందా? అని అడిగాడు. దీనికి అసహనంతో సమీ అవునన్నట్లుగా బదులిచ్చాడు. దీనిని ముబాషిర్ వాయిస్ రికార్డ్ చేశాడు. ఆ తర్వాత వాయిస్ రికార్డుతోపాటు కైఫ్ తీసిన వీడియోలు వాట్సప్ ద్వారా కాగజ్‌నగర్‌లోని మహ్మద్ ఆసిఫ్‌కు పంపించాడు. ఆసిఫ్ కూడా ప్రిన్సిపాల్ వెంకటప్రసాద్ కారణంగా ఉద్యోగం కోల్పోయాడు. దీంతో వీరిద్దరూ ప్రిన్సిపాల్ వెంకటప్రసాద్‌పై కోపంతో కైఫ్ సాయం తీసుకుని ఎస్సెస్సీ ఉర్దూ పేపర్ లీకేజీ డ్రామాకు తెరలేపారు. ఎస్సెస్సీ ఉర్దూ పేపర్ లీకేజీ అంటూ సోషల్‌మీడియాలో తప్పుడు ప్రచారం చేశారు. దీనిపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విచారణ చేపట్టిన అధికారులు, పోలీసులు పేపర్ లీక్ కాలేదని నిర్ధారించారు. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేసిన వారిపై కేసు నమోదు చేశారు.

సీఆర్‌పీఎఫ్ బలగాల కవాతు



కవాతులో ఎస్పీ గౌస్ ఆలం, అధికారులు

ఆదిలాబాద్‌టౌన్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సీఆర్‌పీఎఫ్ బలగాలు గురువారం జిల్లా పోలీసులతో కలిసి జిల్లా కేంద్రంలో కవాతు నిర్వహించాయి. కలెక్టర్ చౌక్‌లో ప్రారంభమైన ఫ్లాగ్‌మార్చ్ పట్టణంలోని ప్రధాన ఎన్టీఆర్ చౌక్, వినాయక చౌక్, నేతాజీ చౌక్, అంబేద్కర్ చౌక్, గాంధీచౌక్, దేవిచంద్ చౌక్, వన్ టౌన్, వినాయక చౌక్ మీదుగా ఎన్టీఆర్ చౌక్ వరకు సాగింది. ఈ సందర్భంగా ఎస్పీ గౌస్ ఆలం మాట్లాడుతూ.. ప్రజల్లో భద్రతాభావం పెంపొందించేందుకే కవాతు నిర్వహించినట్లు తెలిపారు. డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి, సీఆర్‌పీఎఫ్ కమాండెంట్ శ్రీకాంత్, సీఐలు సత్యనారాయణ, అశోక్, శ్రీనివాస్, ఫణిదర్, సాయినాథ్, ఆర్ఐ నవీన్, ఎస్సైలు, రిజర్వ్ సిబ్బంది, సీఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

'ముదిరాజ్‌లకే చైర్మన్ పదవి ఇవ్వాలి'

ఎదులాపురం: మత్స్యశాఖ ఫెడరేషన్ చైర్మన్ పదవిని ముదిరాజ్‌ల కులస్తుకే కేటాయించాలని ముది రాజ్ మహాసభ రాష్ట్ర నాయకులు బొజ్జ నారా యణ, సలేందర్ శివయ్య ముదిరాజ్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం విలేకరులతో మాట్లాడారు. అతి తక్కు వ మంది ఉన్న గంగపుత్ర సామాజిక వర్గానికి మత్స్యశాఖ ఫెడరేషన్ చైర్మన్ పదవి కట్టబెట్టడంపై తీవ్ర ఆక్షేపణ వ్యక్తంజేశారు. సహకార చట్టం ప్రకారం ఎన్నికలు నిర్వహించి ప్రజాస్వామ్య పద్ధతిలో ఫెడరేషన్ చైర్మన్‌ను ఎన్నుకోవాలని కోరారు. సమావేశంలో నాయకులు ధారవేణి రాము, దార్ల రవి, బొజ్జ సంతోష్, ఒరుగంటి శీను, ఇండ్ల భూమన్న, ఈగల పోచ్చన్న, వన్యబోయిన చిన్నయ్య, యువజన నాయకులు మోహన్, క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముస్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



దివ్యదేవరాజన్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

ఎదులాపురం: ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలోని అవుట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్, మున్సిపల్ ఎంప్లాయిస్–వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యేసు రత్నం డిమాండ్ చేశారు. ఈ విషయమై గురువారం కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ హైదరాబాద్ దివ్య దేవరాజన్‌ను కలిసి వినతిపత్రం అందించారు. అవుట్ సోర్సింగ్ కార్మికులకు అవుట్ సోర్సింగ్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, కార్మికులను రెగ్యులర్ చేయాలని, జిల్లాలో ఈఎస్ఐ ఆస్పత్రి ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం మున్సిపల్ జాయింట్ డైరెక్టర్ కృష్ణమోహన్‌రెడ్డికి సమస్యలు వివరించి వినతిపత్రం అందించారు. కొత్తగూడెం ఎమ్మెల్యే, సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావును కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు వివరించి వినతిపత్రం అందించారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే కార్మికులకు సమాన పనికి సమాన వేతనం, ప్రమాద బీమా సౌకర్యం, కార్మికుల మరణానంతరం ఖర్చులకు రూ. 50వేలు ఇప్పించడం తదితర సమస్యలు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్, నాయకులు గాజంగుల చంద్రశేఖర్, కాంతారావు, మెరుగు చిరంజీవి, నారాయణరెడ్డి, అశోక్, నక్క శంకర్, యాదగిరి తదితరులున్నారు.

ఇద్దరిలో.. ఎవరికో?



సీఎం రేవంత్, మంత్రి సీతక్కతో సుగుణ, భాస్కర్, ఎమ్మెల్యే బొజ్జు, సీఎం సలహాదారు వేంనరేందర్‌రెడ్డి

- హస్తం గూటికి సుగుణ, భాస్కర్
- ప్రభుత్వ ఉద్యోగాలకు రాజీనామా
- సీఎం, మంత్రి సమక్షంలో చేరిక
- సుగుణ వైపే అధిష్టానం మొగ్గు?

సాక్షి, ఆదిలాబాద్: ప్రభుత్వ ఉపాధ్యాయురాలు ఆత్రం సుగుణ, ఐటీడీఏ ఏపీవో ఆత్రం భాస్కర్‌లలో కాంగ్రెస్ టికెట్ ఎవరికనే ఉత్కంఠ కొనసాగుతోంది. గురువారం రాత్రి వరకు పార్టీ అభ్యర్థిని ప్రకటించలేదు. కాగా, ఈ ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగాలకు స్వచ్ఛంద విరమణ చేశారు. హైదరాబాద్‌లో గురువారం సీఎం రేవంత్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కాగా, వీరిలో కాంగ్రెస్ అభ్యర్థిత్వం ఎవరికి అనే ఉత్కంఠ ఎక్కువైంది. ప్రజా ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొన్న అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని ఓ మహిళగా సుగుణకు ఆదిలాబాద్ టికెట్ ఇవ్వాలనుకుంటున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి ఈ సెగ్మెంట్ పరిధిలోని నేతలతో అంతర్గత సంభాషణలో పేర్కొన్నట్లు తెలుస్తోంది. ఒకట్రెండు రోజుల్లో ఆమె అభ్యర్థిత్వం ఖరారు చేయనున్నట్లు చెప్పుకొంటున్నారు.

ఆదివాసీలతో సత్సంబంధాలు..

ఆత్రం సుగుణ, ఆత్రం భాస్కర్ ఇరువురికి ఆదివాసీలతో సత్సంబంధాలున్నాయి. ఉట్నూర్‌లో నివసించే సుగుణ భర్త ఆత్రం భుజంగరావు మానవ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్నారు. ఆమె కూడా జిల్లా కార్యదర్శిగా కొనసాగుతున్నారు. ఆదివాసీ మహిళా సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కూడా సుగుణ వ్యవహరిస్తున్నారు. భార్యాభర్తలిద్దరు మూడు దశాబ్దాలుగా ఆదివాసీ హక్కుల కోసం పోరాడుతున్నారు. కాగా, ఆత్రం భాస్కర్ ఐటీడీఏ ఏపీవోగా ఇప్పటివరకు కొనసాగారు. ఇచ్చోడకు చెందిన ఆయన ఉట్నూర్ ఐటీడీఏలో ఎన్నో ఏళ్లుగా వివిధ హోదాల్లో పనిచేస్తూ ఆదివాసీలతో సత్సంబంధాలు కలిగి ఉన్నారు. గురువారం ఇరువురిని పార్టీలో చేర్చుకున్నప్పటికీ అభ్యర్థి ఎవరనే విషయం ప్రకటించలేదు. క్షేత్రస్థాయిలో ఇరువురు ప్రచారం చేయాలని సూచించినట్లు సమాచారం.

అడవుల సంరక్షణ బాధ్యత అందరిది



బైక్ ర్యాలీ ప్రారంభిస్తున్న డీఎఫ్‌వో ప్రశాంత్ బాజీరావ్‌పాటిల్, పాల్గొన్న పోలీస్ సిబ్బంది

- కలెక్టర్ రాజర్షిషా
- జెడ్పీ సమావేశ మందిరంలో ప్రపంచ అటవీ దినోత్సవం
- జిల్లా కేంద్రంలో బైక్ ర్యాలీ



ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్, ఎస్పీ, డీఎఫ్‌వో, అధికారులు

ఆదిలాబాద్‌టౌన్: అడవుల సంరక్షణ బాధ్యత అందరిదని కలెక్టర్ రాజర్షిషా పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని జెడ్పీ సమావేశ మందిరంలో గురువారం ప్రపంచ అటవీ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక సారథి, విద్యార్థులు వివిధ కార్యక్రమాలు ప్రదర్శించారు. అంతకుముందు అటవీశాఖ కార్యాలయం నుంచి చేపట్టిన బైక్ ర్యాలీని డీఎఫ్‌వో ప్రశాంత్ బాజీరావ్‌పాటిల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అడవుల సంరక్షణకు చిప్కో తరహా మరో ఉద్యమం అవసరమని పేర్కొన్నారు. ప్రస్తుతం జిల్లాలో 25శాతం వరకు అటవీ విస్తీర్ణం ఉండగా, 40 శాతానికి పెంచాల్సిన బాధ్యత అధికారులు, ప్రజలపై ఉందన్నారు. అటవీ సంపద నశించి వన్యప్రాణులు జనావాసాల్లోకి వస్తున్నాయని, తక్కువగా చెట్లున్న అటవీ ప్రాంతంలో మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. అటవీ రక్షణలో పలువురు అధికారులు ప్రాణాలు కోల్పోగా వారిని స్మరించుకున్నారు. అటవీ దినోత్సవం సందర్భంగా ఇటీవల నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. అంతకుముందు అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్ తిలకించారు. ఎస్పీ గౌస్ ఆలం, ట్రెనీ అసిస్టెంట్ కలెక్టర్ వికాస్ మహతో, ఎఫ్‌డీవో బెర్నోబా, ఎఫ్ఆర్వో గులాబ్ సింగ్, అటవీ అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చెక్‌పోస్టుల వద్ద నిరంతర నిఘా



పత్రాలు పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

జైనథ్: జిల్లాలోని అన్ని అంతర్రాష్ట్రీయ చెక్‌పోస్టుల వద్ద 24గంటల పటిష్ఠ నిఘా ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. గురువారం ఆయన మండలంలోని భోరజ్, పిప్పర్‌వాడ, ఆనంద్‌పూర్ గ్రామాల వద్ద ఏర్పాటు చెక్‌పోస్టులను ఎస్పీ గౌస్ ఆలంతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వచ్చి పోయే పలు వాహనాలు, బస్సులను ఆయన స్వయంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మద్యం, నగదు అక్రమ రవాణాను అరికట్టాలని సూచించారు. ప్రతీ చెక్‌పోస్ట్ వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. సీజ్ చేసిన నగదు, మద్యానికి సంబంధించిన రసీదులు తప్పనిసరిగా జారీ చేయాలని తెలిపారు. సీజ్ రిజిస్టర్‌ను పకడ్బందీగా నిర్వహించాలని ఆయన అధికారులను ఆదేశించారు. డీఎస్పీ జీవన్‌రెడ్డి, ఇతర అధికారులున్నారు.

సీపీఆర్‌తో ప్రాణాలు కాపాడొచ్చు



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జైసింగ్ రాథోడ్

ఆదిలాబాద్‌టౌన్: గుండెపోటు వచ్చినవారి ప్రాణాలు సీపీఆర్‌తో కాపాడవచ్చని రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ పేర్కొన్నారు. గురువారం రిమ్స్ ఆడిటోరియంలో నర్సింగ్ విద్యార్థులకు కార్డియో పల్మనరీ రిసోర్స్ సిస్టం (సీఆర్‌పీ)పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రిమ్స్ డైరెక్టర్ మాట్లాడుతూ.. చాలామంది గుండెపోటు వచ్చిన సమయంలో కిందపడి మృత్యువాత పడుతున్నారని, ఇలాంటి వారిని సీపీఆర్ చేసి బతికించే అవకాశముందని పేర్కొన్నారు. నర్సింగ్ విద్యార్థులంతా సీపీఆర్ నేర్చుకోవాలని సూచించారు. రిమ్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ విద్యావిల్సన్, అనస్తీషియా విభాగం హెచ్‌వోడీ చంద్రశేఖర్, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ అనిత, వైస్ ప్రిన్సిపాల్ శకుంతల, అధ్యాపకులు శ్రీదేవి, శరత్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పాదరక్షలు ధరించిన డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్


పాదరక్షలు ధరిస్తున్న శ్రీధర్

కైలాస్‌నగర్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేంత వరకూ పాదరక్షలు ధరించనని ప్రతిజ్ఞ పూనిన డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీధర్ తన దీక్షను గురువారం విరమించారు. హైదరాబాద్‌లోని సీఎం నివాసంలో జరిగిన కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క సమక్షంలో తన దీక్షను విరమించి పాదరక్షలను ధరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌తో పాటు జిల్లా కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

నగదు స్వాధీనం

నర్సాపూర్(జి): మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన వాహనాల తనిఖీలో మహారాష్ట్రలోని నాందేడ్ పట్టణానికి చెందిన ఇర్ఫాన్‌ఖాన్ వద్ద నుంచి రూ.70 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై హన్మాండ్లు తెలిపారు. భైంసా నుండి నిర్మల్‌కు ఫోర్ వీలర్ వాహనంలో నగదు తీసుకెళ్తుండగా పట్టుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఎలాంటి పత్రాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సీజ్ చేసిన నగదును తదుపరి చర్యల నిమిత్తం సీటీఓ(కలెక్టర్ ఆఫీస్) నిర్మల్‌కు పంపినట్లు ఆయన పేర్కొన్నారు.

మట్కా నిందితుడి అరెస్టు


పోలీసుల అదుపులో షేక్ రఫీక్

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని స్పిన్నింగ్ మిల్ ప్రాంతంలో గురువారం మట్కా నిందితుడిని పట్టుకున్నట్లు సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ పి.చంద్రశేఖర్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించి ఖుర్షీద్‌నగర్‌కు చెందిన షేక్ రఫీక్ వద్ద రూ.11,100 నగదుతో పాటు మట్కా చిట్టీలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుడిపై టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.


గుడుంబా పట్టివేత

నర్సాపూర్(జి): మండలంలోని బూర్గుపల్లి (జి) గ్రామానికి చెందిన రాథోడ్ గోవింద్ అక్రమంగా తయారుచేసి నిల్వ ఉంచిన రూ.4400 విలువైన 11 లీటర్ల గుడుంబాను గురువారం పట్టుకున్నట్లు ఎస్సై హన్మండ్లు తెలిపారు. నిందితునిపై కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధం

నిర్మల్: విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధమైన సంఘటన సారంగాపూర్ మండలంలో చోటు చేసుకుంది. స్వర్ణ గ్రామానికి చెందిన అచ్చ రాజేశ్వర్ గురువారం కుటుంబ సభ్యులతో కలిసి పొలానికి వెళ్లారు. మధ్యాహ్నం ఇంట్లో నుంచి పొగలు రావడం గమనించిన స్థానికులు సమీప బోరుబావుల్లో మోటార్లు ఆన్‌చేసి మంటలు ఆర్పివేశారు. అప్పటికే ఇంట్లోని సామగ్రితో పాటు నిత్యావసర సరుకులు దగ్ధమయ్యాయి. సుమారు రూ.1.20 లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు ఎంఆర్ఐ లక్ష్మీనారాయణ అంచనా వేశారు.

ఓటుందా.. సరిచూసుకోండి..!



- ఏప్రిల్ 15వరకు నమోదుకు అవకాశం

ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో ఓటర్ల వివరాలిలా...

నియోజకవర్గాలు: 07
(సిర్పూర్, ఆసిఫాబాద్, ఆదిలాబాద్, బోథ్, ఖానాపూర్, నిర్మల్, ముధోల్)

మహిళలు: 8,41,250

పురుషులు: 8,02,267

ఇతరులు: 87

మొత్తం ఓటర్లు: 16,43,604

భైంసాటౌన్(ముధోల్): లోక్‌సభ ఎన్నికలకు నగారా మోగింది. ఎన్నికల సంఘం ఇప్పటికే ఎన్నికల నిర్వహణకు షెడ్యూల్ సైతం ప్రకటించింది. మే 13న ఎన్నికలు జరగనుండగా ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఎస్ఆర్–2024)లో భాగంగా గత నెల 8న ఓటరు తుది జాబితా విడుదల చేసింది. ఈ మేరకు తుది జాబితాలో ఓటు ఉందో.. లేదో పరిశీలించుకుని.. లేనిపక్షంలో నమోదు చేసుకునేందుకు అవకాశమిచ్చింది. ఇప్పటి వరకు ఓటు నమోదు చేసుకోనివారు, ఇతర ప్రాంతాల నుంచి ఇక్కడికి వచ్చినవారు ఏప్రిల్ 15 వరకు ఓటు నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. నూతనంగా ఓటు నమోదు చేసుకునేవారు ఫారం –8 ద్వారా ఆన్‌లైన్‌లో లేదా బూత్ లెవల్ అధికారిని సంప్రదించి ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. లేదా ఆన్‌లైన్‌లో nvsp.in, ceotelangana.nic. in, voters.eci.gov.in వెబ్‌సైట్లలో దరఖాస్తు చేసుకోవచ్చు. ఓటు ఉందో లేదో సరిచూసుకునేందుకు ఆన్‌లైన్‌లో nvsp.in, ceotelangana.nic.in వెబ్‌సైట్లలో తెలుసుకోవచ్చు.

మొత్తం ఓటర్లు 16.43 లక్షలు

ప్రత్యేక ఓటరు సవరణ తుది జాబితా ప్రకారం ఆదిలాబాద్ జిల్లా పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో మొత్తం 16,43,604 మంది ఓటర్లు ఉండగా, వీరిలో 8,02,267 మంది పురుషులు, 8,41,250 మంది మహిళలు, 87 మంది ఇతరులు ఉన్నారు. ప్రస్తుత ఓటరు జాబితా ప్రకారం సిర్పూర్ మినహా అన్ని నియోజకవర్గాల్లోనూ పురుషులతో పోలిస్తే మహిళా ఓటర్లే అధిక సంఖ్యలో ఉన్నారు. దీంతో రానున్న లోక్‌సభ ఎన్నికల్లోనూ అభ్యర్థుల జయాపజయాల్లో మహిళా ఓటర్లే కీలకం కానున్నారు. అలాగే అన్ని నియోజకవర్గాలతో పోలిస్తే నిర్మల్‌లో అత్యధికంగా 2,56,147 మంది ఓటర్లు ఉండగా, తక్కువగా బోథ్‌లో 2,10,915 మంది ఓటర్లు ఉన్నారు. థర్డ్ జెండర్ ఓట్లలోనూ నిర్మల్ 20 ఓట్లతో ముందంజలో ఉండగా, బోథ్‌లో ఇద్దరే ఉన్నారు.

నియోజకవర్గాల వారీగా ఓటర్లు

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
సిర్పూర్	1,14,484	1,14,359	12	2,28,855
ఆసిఫాబాద్	1,12,510	1,14,056	16	2,26,582
ఆదిలాబాద్	1,19,154	1,24,375	06	2,43,535
బోథ్	1,02,333	1,08,580	02	2,10,915
నిర్మల్	1,21,070	1,35,057	20	2,56,147
ఖానాపూర్	1,09,508	1,14,445	13	2,23,966
ముధోల్	1,23,208	1,30,378	18	2,53,604




పరీక్షకు హాజరవుతున్న బాలికలు

'ఒంటికీ రెంటికీ' ఇదేం పరీక్ష


తలుపులు లేకుండా ఉన్న మరుగుదొడ్డి


శిథిలావస్థలో మరుగుదొడ్లు

పదోతరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు ఆయా పాఠశాలల్లో సరిపడా మరుగుదొడ్లు లేక ఒంటికి రెంటికీ ఇబ్బందులు పడుతున్నారు. అన్ని ఏర్పాట్లు చేశామని అధికారులు చెప్పున్నప్పటికీ జిల్లా కేంద్రంలోని సోమార్‌పేట్ ప్రభుత్వ పాఠశాలలో చూస్తే పరిస్థితి ఇట్టే తెలిసిపోతుంది. తలుపులు విరిగిపోయి, గోడలు కూలిపోయి శిథిలావస్థకు చేరిన మరుగుదొడ్లే ఇందుకు నిదర్శనం. వాటినే అత్యవసర పరిస్థితుల్లో విద్యార్థులు వాడుకుంటున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్


పరీక్షకు హాజరవుతున్న బాలురు

నిర్వహణ నిధులేవి?

- నెలల తరబడి విడుదల కాని ఫైనం
- రైతువేదికల నిర్వహణకు ఇబ్బంది


యాపల్‌గూడ రైతువేదిక

ఆదిలాబాద్‌రూరల్: రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చేందుకు క్లస్టర్‌కు ఒకటి చొప్పున నిర్మించిన రైతువేదికల నిర్వహణ ప్రశ్నార్థకమైంది. వీటి నిర్వహణకు నిధులు సకాలంలో రాక నిర్వహణ కొరవడింది. సమావేశాలకు ఉన్నతస్థాయి అధికారులు వస్తున్నారంటే రైతువేదికను శుభ్రం చేసేందుకు ప్రైవేట్ కార్మికులకు టీ, టిఫిన్, తాగునీరు, విద్యుత్ బిల్లులకు సంబంధించిన డబ్బులు ఏఈవోలే వెచ్చిస్తున్నారు. ఏఈవోలు పట్టించుకోని చోట అపరిశుభ్రంగా మారాయి. కాగా, ప్రభుత్వం నియోజకవర్గానికో రైతువేదిక ఎంపిక చేసి ఆన్‌లైన్ ద్వారా వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలతో అన్నదాతలకు సూచనలిస్తోంది. ఆదిలాబాద్ రూరల్ మండలం భీంసరి, చాందా (టీ), అనుకుంట, యాపల్‌గూడ, అంకోలి, పిప్పల్‌ధరి, ఖండాలో ఏడు, మావల మండలంలో మావల ఒక క్లస్టర్ ఉంది. 2021లో రూ.22లక్షలతో ఒక్కో రైతువేదిక నిర్మించారు. ఇందులో విద్యుత్ బిల్లుకు రూ.వెయ్యి, పారిశుధ్య నిర్వహణకు రూ.3వేలు, రైతుల శిక్షణకు రూ.2,500, తాగునీటికి రూ.500, మరమ్మతులు, స్టేషనరీ, జిరాక్సులు, ఇతర ఖర్చులకు రూ.2వేలు కేటాయించారు. ఈ మేరకు గతేడాది ఫిబ్రవరి వరకు నిధులువిడుదల చేసింది. గతేడాది మార్చి నుంచి నిధులు నిలిపివేయడంతో వాటి నిర్వహణ భారమైంది. దీంతో గదులను శుభ్రం చేయించడం, విద్యుత్ బిల్లులు చెల్లించడం ఇబ్బందికరంగా మారిందని పలువురు ఏఈవోలు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం సకాలంలో నిధులు విడుదల చేయాలని కోరుతున్నారు.

రైతులు ఆధునిక పద్ధతులు పాటించాలి


మాట్లాడుతున్న శాస్త్రవేత్త మహేందర్

లోకేశ్వరం: రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించి అధిక దిగుబడులు పొందాలని నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి పసుపు పరిశోధన సంస్థ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ మహేందర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రైతు వేదికలో రాబోయే ఖరీఫ్ సీజన్‌లో పసుపు పంట సాగు చేసే రైతులకు ఒకరోజు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పసుపు రకాల గురించి ప్రదర్శన ఏర్పాటు చేసి విత్తనాల ఎంపిక, నేల మొక్క సారవంత గుణాన్ని బట్టి ఎంత దిగుబడి వస్తుందని, ఎలాంటి యాజమాన్య పద్ధతులు పాటించాలన్న విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కమ్మర్‌పల్లి శాస్త్రవేత్త శ్రీనివాస్, భైంసా ఉద్యానవన అధికారి హర్షవర్ధన్, కంపెనీ చైర్మన్ నాగమణి, వ్యాపా ర విస్తీర్ణ అధికారి అనిల్, సీఈవో మేఘన, తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో విజయమే లక్ష్యం


మొక్క నాటుతున్న ఆత్రం సక్కు

- బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ఆత్రం సక్కు

ఆదిలాబాద్‌టౌన్: పార్లమెంట్ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ముందుకు సాగుతామని బీఆర్ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. అటవీ దినోత్సవం సందర్భంగా కార్యాలయ ఆవరణలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్నతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల ముందుకు తీసుకెళ్తామన్నారు. పేదల సంక్షేమం కోసం తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ అనేక పథకాలను ప్రవేశపెట్టారని తెలిపారు. కేంద్రంలో బీజేపీ ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందన్నారు. టెక్స్‌టైల్ పార్క్, సీసీఐ పునరుద్ధరణ, గిరిజన యూనివర్సిటీపై నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తుందన్నారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజాని, పట్టణ అధ్యక్షుడు అజయ్, బీఆర్ఎస్ నాయకులు స్వరూపరాణి, సాజిద్, ప్రకాష్, నర్సింగ్, భరత్, అష్రఫ్, మోబిన్, విజ్జగిరి నారాయణ, రాము, తదితరులు పాల్గొన్నారు.

మద్యం పట్టివేత


పట్టుకున్న మద్యంతో పోలీసులు


పట్టుకున్న మద్యంతో ఎస్సై రజనీకాంత్

తాంసి: భీంపూర్ మండలంలోని నిపాని, పిప్పల్‌కోటి గ్రామాల్లో బుధవారం రాత్రి అక్రమంగా విక్రయిస్తున్న మద్యం పట్టుకున్నట్లు ఎస్సై ప్రదీప్‌కుమార్ తెలిపారు. గ్రామానికి చెందిన ఇద్దరిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. మద్యం విలు వ రూ.13,690 ఉంటుందన్నారు. పట్టుకున్న వారిలో ఏఎస్సై ముంతాజ్, స్వామి, శివాజీ, సుభాష్, తదితరులు ఉన్నారు.

కుభీర్: ఎన్నికల కోడ్ అమలు నేపథ్యంలో గురువారం మండలంలోని పార్డి(బి) గ్రా మంలోని ఒక దుకాణంలో తనిఖీ చేయగా అ క్రమంగా నిల్వ ఉంచిన రూ.7,920 విలువైన మద్యం పట్టుబడినట్లు ఎస్సై పీ.రవిందర్ తెలిపారు. మద్యం అమ్ముతున్న ర్యాపన్‌వార్ పాపన్నపై కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

కుంటాల: మండల కేంద్రంలో గురువారం రాత్రి ఎస్సై రజనీకాంత్ ఆధ్వర్యంలో పోలీసులు హోటళ్లు, కిరాణా దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. ఓ హోటల్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన రూ.6,844 విలువగల 10 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు ఎస్సై వెల్లడించారు. ఏఎస్సై దేవరావు, సిబ్బంది సవిత, మనోహర్, తదితరులు పాల్గొన్నారు.

బెల్టుషాపులపై దాడులు

ఆదిలాబాద్‌టౌన్: ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్టుషాపులపై పోలీసులు దాడులు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం ఆదిలాబాద్ పట్టణంలోని ఇంద్రానగర్ కాలనీకి చెందిన మరక్వాడ్ సాయికుమార్ గౌడ్, సునీల్, అడ్డివార్ ప్రమోద్ రెడ్డి నిర్వహిస్తున్న బెల్టు షాపులపై వన్‌టౌన్ పోలీసులు దాడులు నిర్వహించారు. దుకాణాల్లో నిల్వ ఉంచిన 10 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. గాంధీనగర్‌కు చెందిన రుక్మా నిర్వహిస్తున్న బెల్టు షాపును తనిఖీ చేసి మూడున్నర లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. సుందరయ్యనగర్‌కు చెందిన సుధాం బెల్ట్‌షాపుపై దాడి చేసి లీటర్ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ


వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

ముధోల్: ఎన్నికల కోడ్ నేపథ్యంలో వాహనాల తనిఖీలు ముమ్మరంగా సాగుతుంది. మండల కేంద్రంలోని కంటి ఆసుపత్రి సమీపంలో ఎస్సై సాయికిరణ్ ఆధ్వర్యంలో గురువారం వాహనాల తనిఖీ నిర్వహించారు. మద్యం, డబ్బుల తరలింపుపై దృష్టిసారిచామని ఎస్సై తెలిపరు. సరైన పత్రాలు లేని వాహనాలకు జరిమానా విధించారు.

నకిలీ సర్టిఫికెట్ లెక్చరర్ తొలగింపు

ఆసిఫాబాద్‌రూరల్/బెజ్జూర్: నకిలీ సర్టిఫికెట్లతో కాంట్రాక్టు ఉద్యోగాన్ని రెగ్యులరైజ్ చేయించుకున్న బెజ్జూర్ జూనియర్ కళాశాల గణిత అధ్యాపకుడు కలవేణి నాగరాజును ఉద్యోగంలో నుంచి తొలగిస్తూ ఆర్జేడీ ఉత్తర్వులు జారీ చేసినట్లు డీఐఈవో శంకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కాంట్రాక్టు ఉద్యోగులుగా పనిచేస్తున్న వారిని గత మే నెలలో ప్రభుత్వం రెగ్యులరైజ్ చేస్తూ నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా 2011 నుంచి నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగం చేస్తున్న నాగరాజుపై ఫిర్యాదు రావడంతో విచారణ అనంతరం ఉద్యోగంలోంచి తొలగిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

విద్యార్థులకు వసతులు కల్పించాలి

- తెలంగాణ విద్యార్థిపరిషత్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్


మాట్లాడుతున్న కొట్టూరి ప్రవీణ్‌కుమార్

లోకేశ్వరం: ఎస్సీ హాస్టల్ విద్యార్థులకు అన్ని వసతులు కల్పించాలని తెలంగాణ విద్యార్థి పరిషత్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కొట్టూరి ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌ను గురువారం సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ఎస్సీ హాస్టల్‌లో రెగ్యులర్ వార్డెన్‌ను నియమించాలన్నారు. విద్యార్థుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. హాస్టల్ సిబ్బంది సమయపాలన పాటించేలా చూడాలని కోరారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలన్నారు. విద్యార్థుల సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఆయన వెంట నిర్మల్ పట్టణ కన్వీనర్ జాదవ్ మిథున్ ఉన్నారు.

ఇసుక లారీ పట్టివేత


పట్టుకున్న లారీతో ఎస్సై

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల గోదావరి నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని గురువారం పట్టుకున్నట్లు ఎస్సై గోపతి సురేశ్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించగా మంచిర్యాల గోదావరి నుంచి జగిత్యాలకు అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న లారీని పట్టుకున్నారు. వాహనాన్ని స్టేషన్‌కు తరలించి డ్రైవర్ పడాల సాయికిరణ్, క్లీనర్ ఎమ్మాజీ ప్రసాద్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ట్రాక్టర్ పట్టివేత

గోదావరి నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఓ ట్రాక్టర్‌ను బుధవారం రాత్రి పట్టుకున్నట్లు ఎస్సై గోపతి సురేశ్ తెలిపారు. పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో వేంపల్లి గ్రామ శివారులోని గోదావరి నుంచి అనుమతులు లేకుండా ఓ ట్రాక్టర్ అక్రమంగా ఇసుక తరలిస్తుండగా పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ యజమాని బొడ్డు శంకర్, డ్రైవర్ కుర్ర అంజిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన యాచకుడి మృతి


కనక నాందేవ్ మృతదేహం

గుడిహత్నూర్: మండల కేంద్రంలో బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యాచకుడు కనక నాందేవ్ (77) చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఇంద్రవెల్లి మండలం దేవాపూర్‌కు చెందిన కనక నాందేవ్ మండల కేంద్రంలో యాచిస్తూ జీవిస్తున్నాడు. కాళ్లు పని చేయక పోవడంతో చిన్న చక్రాల బండిలోనే కూర్చొని యాచిస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం స్థానిక అండర్ మాస్ పాస్ వద్ద ఉండగా కారు ఢీ కొట్టింది. తీవ్రగాయాలు కావడంతో స్థానికులు వెంటనే రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్సై బలిరాం తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

శ్రీరాంపూర్: ఈ నెల 20న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన మహిళ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం శ్రీరాంపూర్ ఆర్కే6 గాంధీనగర్‌కు చెందిన అల్లాడి వైష్ణవి (33) మెప్మాలో ఆర్పీగా పనిచేస్తోంది. ఆర్థిక ఇబ్బందుల కారణంగా బుధవారం ఇంట్లోనే పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు ముందుగా మంచిర్యాలలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది.